క్లుప్తంగా

76 మందికి ఆయుర్వేద వైద్యం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రొటేరియన్ ఉప్పులూరి వీరభద్రరావు ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 76 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె. శ్రీవిద్య, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పాలదాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కార్యదర్శి కాళ్ల రాంబాబు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగన్నాథపురం సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న బి.అనంతలక్ష్మి గాయపడ్డారు. విధులకు హాజరయ్యేందుకు ఆమె తన స్వగ్రామమైన సంజీవపురం నుంచి జగన్నాథపురం స్కూటీపై వెళుతున్నారు. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు వేగంగా ఆమెను ఢీకొట్టింది. దీంతో అనంతలక్ష్మి కాలికి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ కె. ప్రశాంత్ తెలిపారు.

మరో ప్రమాదంలో దంపతులకు ..

కొవ్వూరు: వేములూరు సమీపంలోని దీప్తి స్కూల్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తోగుమ్మి గ్రామానికి చెందిన వంగటూరి రామలక్ష్మి, ఆమె భర్త వెంకట దుర్గాప్రసాద్ గాయపడ్డారు. రాజమహేంద్రవరం వెళ్లి మోటార్ సైకిల్‌పై శుక్రవారం రాత్రి తిరిగి వస్తున్న ఆ దంపతులను ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆ దంపతులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు టౌన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు.

నేడు నాయీబ్రాహ్మణ వన సమారాధన

కొవ్వూరు: నాయీ బ్రాహ్మణ వృత్తి, ఉద్యోగ, వ్యాపారస్తుల కార్తిక వన సమారాధనను ఆదివారం పట్టణంలోని వేములూరు రోడ్డులోని దుద్దుపూడి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మేడూరి వీర్రాజు శనివారం తెలిపారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు, విందుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

10న కాపు వన సమారాధన

కొవ్వూరు నియోజకవర్గ స్థాయి కాపు వన సమారాధన కార్యక్రమాన్ని ఈనెల 10న పట్టణ శివార్లలోని పెరుమళ్ల ఉమామహేశ్వరరావు గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యుడు మైపాల వెంకట రామమ్మోహనరావు (రాంబాబు) తెలిపారు.కొవ్వూరు ప్రెస్ క్లబ్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం కార్తిక దామోదరుడి పూజ నిర్వహిస్తామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కాపు సోదరులంతా కుటుంబ సమేతంగా ఈ వన సమారాధనకు హాజరు కావాలని ఆయన కోరారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాపు సంఘం నాయకులు యాళ్ల నరసింహారావు, పెరుమళ్ల ఉమామహేశ్వరరావు, గండ్రోతు శివరామకృష్ణ, నగ్లపాటి శ్రీనివాస్, చిలంకుర్తి వెంకట సుబ్బారావు (బాబి) పాల్గొన్నారు.

పరిహారం విడుదల చేయాలి

నిడదవోలు: ఐఎఫ్‌టీయూ అనుబంధ అభ్యుదయ పెయింటర్స్, కళాకారుల యూనియన్ సమావేశం శనివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో జరిగింది. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా కార్మికులకు ఇచ్చే ప్రసూతి, వివాహ, మరణం, వైద్యం తదితర పరిహారాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రవ్వ సురేష్‌కుమార్, నూతంగి రమేష్, ఈమని గ్రీష్మకుమార్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో..

ఉండ్రాజవరం: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో మండలంలోని పసలపూడికి చెందిన తిట్ల విశ్వేశ్వరరావు (38) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి, భార్య రాణికి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీంతో కొంతకాలంగా ఆమె పుట్టింట్లో ఉంటోంది. కాపురానికి రావలసిందిగా విశ్వేశ్వరరావు భార్యను పలుమార్లు కోరినా, అందుకు ఆమె అంగీకరించడం లేదు. దీంతో మనస్తాపం చెందిన విశ్వేశ్వరరావు శనివారం తన ఇంటి వద్ద పొలాలకు వేసే గుళికలను నీటిలో కలుపుకుని తాగేశాడు. ప్రమాదకర స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు తెలిపారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత
- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన



నిడదవోలు అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

నిడదవోలు: ప్రస్తుతం స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందిస్తున్నామని, ఇలాంటి తరుణంలో ఓటు హక్కు లేని అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థినులకు ఓటు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే ఉద్దేశంతో స్వీప్ కార్యక్రమాన్ని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్దా రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు ఈ ప్రత్యేక శిబిరాల వద్దకు వచ్చి జాబితాలో తమ ఓటు ఉందో లేదో సరి చూసుకోవాలన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం 6- బి ద్వారా ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ లింకేజీ, ఫారం- 7 ద్వారా మరణించిన వారి పేర్ల తొలగింపు, వేరొక నియోజకవర్గం, రాష్ట్రానికి బదిలీ ఐతే తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫారం -8 ద్వారా అక్షర దోషాలు, ఫొటో, డోర్ నంబర్ మార్పు, వేరే పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీ వంటివి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 9 వరకూ ఓటరు నమోదు జరుగుతుందన్నారు. ఆదివారం కూడా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్, ఎనిమిదో వార్డు సచివాలయం, మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు శిబిరాన్ని అధికారులతో కలసి కలెక్టర్ మాధవీలత పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో కృష్ణ నాయక్, నిడదవోలు ఈ ఆర్వో ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్ ఎం.గంగరాజు, మునిసిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 243 దరఖాస్తులు

దేవరపల్లి: కొత్తగా ఓటు నమోదుకు మండలంలో 243 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని 67 బూలింగ్ బూత్‌ల వద్ద శనివారం ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్టు తహసీల్దార్ ఎం. రామకృష్ణ తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కోసం (ఫారం 6) 243 దరఖాస్తులు రాగా, తొలగింపునకు (ఫారం 7) 52, చేర్పులు, మార్పులు, తప్పులను సరిదిద్దడానికి(ఫారం 8) 28 దరఖాస్తులు వచినట్టు ఆయన వివరించారు. ఆదివారం కూడా శిబిరాలు కొనసాగుతాయని, 18 ఏళ్లు వయస్సు నిండిన యువతీ, యువకులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం, జగన్నాథపురం, వేళ్లచింతలగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సి. యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, లేదా దూరప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్. కృష్ణ, వీఆర్వో, బూత్‌లెవెల్ అధికారులు ఉన్నారు.

కొవ్వూరు నియోజవర్గానికి 943 దరఖాస్తులు

కొవ్వూరు: శనివారం నాటి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా 943 దరఖాస్తులు అందాయని ఇన్‌చార్జ్ ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్ తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు నిమిత్తం 536, మరణించిన వారి పేర్ల తొలగింపు, వేరొక నియోజక వర్గం, రాష్ట్రానికి బదిలీ అయిన వారి ఓట్ల తొలగింపు నిమిత్తం 82, జాబితాలో అక్షర దోషాలు, డోర్ నంబర్ మార్పు, వేరొక పోలింగ్ కేంద్రానికి పేరు మార్పు వంటి వాటి కోసం ఫారం-8 దరఖాస్తులు 325 చొప్పున అందాయని ఆయన వివరించారు. కాగా కొవ్వూరు మండలంలోని వేములూరు, తోగుమ్మి, వాడపల్లి గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ పరిశీలించారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిర్వహించినట్టు తహసీల్దార్ కిశోర్‌కుమార్ తెలిపారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. నల్లజర్ల, ఆవపాడు, దూబచర్ల గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని గోపాలపురం నియోజకవర్గ ఎలక్టోరల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వెంకట సుధాకర్ శనివారం పరిశీలించారని తహసీల్దార్ తెలిపారు. కాగా మండలంలో శనివారం ఫారం-6 ద్వారా 218 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. సవరణ కోసం ఫారం-8 ద్వారా 36 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మరణించిన, గ్రామాంతరం వెళ్లిన వారు 74 మంది ఫారం -7 ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ చెప్పారు.



గుడ్డిగూడెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) యశ్వంత్‌కుమార్‌రెడ్డి



నల్లజర్లలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వెంకట సుధాకర్



కొవ్వూరులో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్

ఆలయాల్లో కార్తిక పూజలు



కలవలపల్లి శివాలయంలో లక్ష సహస్ర నామ దీపారాధన

చాగల్లు: కార్తిక మాసం సందర్భంగా శనివారం పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. చాగల్లు, బ్రాహ్మణగూడెం, చిక్కాల, మార్కొండపాడు గ్రామాల ఆలయాలను భారీ ఎత్తున భక్తులు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శివునికి అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు దీపారాధనలు చేశారు. కలవలపల్లి శివాలయంలో లక్ష సహస్ర నామ దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో దూబచర్ల డైట్‌లో కళా ఉత్సవ్

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల డైట్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పీవీ రమణమూర్తి శనివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 9,10, ఇంటర్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మొత్తం 10 కళా రూపాలలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 11న గాత్ర సంగీతం, జానపద, వాద్య సంగీతం, నాట్యం (సంప్రదాయం, జానపద) విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే 12న ద్విమితీయ, త్రిమితీయ చిత్రణ, సంప్రదాయబద్ధ ఆటబొమ్మలు, ఆటలు, నాటకం (ఏకపాత్రాభినయం) పోటీలు నిర్వహిస్తామని వివరించారు. గతేడాది ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న వారు ఈ ఏడాది పోటీల్లో పాల్గొనేందుకు అనర్హులన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు ఎవరి సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. ప్రతి కళారూప ప్రదర్శన సమయం ఐదు నిమిషాలని ప్రిన్సిపాల్ చెప్పారు. ఆసక్తి గల విద్యార్థినీవిద్యార్థులు డైట్ కళాశాల బోధన సిబ్బంది ఎం.రాంప్రసాద్ 95339 96474, వి.వెంకటేశ్వరరావు 94403 52510లను సంప్రదించాలన్నారు.

మిస్టర్ పర్‌ఫెక్ట్.. తలారి

- పార్టీ అధిష్టానం పిలుపును నూరు శాతం పాటిస్తున్న ఎమ్మెల్యే
- అది గడప గడపకూ అయినా, ఆరోగ్య సురక్ష అయినా..
- ప్రస్తుతం రోజుకొక గ్రామంలో పల్లె నిద్ర చేస్తూ, ప్రజలతో మమేకం అవుతూ..



పోతవరం పల్లె నిద్రలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: పార్టీ అధిష్టానం ఆదేశాలను తూచ తప్పకుండా ఆచరణలో పెట్టే శాసనసభ్యుల్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన కార్యక్రమం గడప గడపకూ మన ప్రభుత్వం అయినా, వైఎస్సార్ ఆరోగ్య సురక్ష అయినా ఒకే విధంగా నియోజకవర్గం అంతటా నూరు అమలు చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కూడా ఎమ్మెల్యే తలారి అంతే చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారు. రోజూ ఆయన ఏదో ఒక గ్రామంలో పల్లె నిద్ర చేస్తున్నారు. కేవలం పల్లె నిద్రతోనే ఆయన సరిపెట్టడం లేదు. ఆ గ్రామం అంతటా పాదయాత్రగా, లేదా స్వయంగా బైక్ పై అన్ని వీధులకూ వెళ్లి ప్రజలను కలుసుకుంటున్నారు. అవసరమైతే గ్రామ రచ్చబండ వద్ద గ్రామస్తులతో ముచ్చట్లాడి, అక్కడి సమస్యలు తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఇదే రీతిలో శుక్రవారం పోతవరం గ్రామంలోని ఎస్సీ పేట కమ్యూనిటీ హాలు వద్ద ఎమ్మెల్యే తలారి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 11 గంటల వరకూ ఆ ప్రాంత ప్రజలతో మమేకమయ్యారు. శనివారం ఉదయం ఆయన నిద్ర లేవగానే ఆ ప్రాంత మహిళలు తమ సమస్యలు చెప్పడానికి వచ్చారు. ఈ ప్రాంతంలో ప్రధాన డ్రైన్ పూడిక తీయించాలని, 2016లో ప్రారంభమైన పీహెచ్‌సీ భవన నిర్మాణం ఇంతవరకూ పూర్తి కాలేదని వారు ఎమ్మెల్యేకు వివరించారు. పోతవరం-యర్నగూడెం, కవు లూరు-జి.కొత్తపల్లి రహదారిని ఆధునీకరించాలని, గ్రామంలో అన్యాక్రాంతం అవుతున్న సీఎస్ఐ స్కూల్ స్థలాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య, పార్టీ నాయకులు ఆయనతో ఉన్నారు.

మిచాంగ్ హెచ్చరికలతో రైతుల్లో కలవరం



గౌరీపట్నం వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లుకు ఎగుమతి చేస్తున్న దృశ్యం

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో మెట్ట ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత రైతులు ప్రధానంగా పొగాకు, వరి పంటలను సాగు చేస్తున్నారు. పొగాకు తోటలు ప్రస్తుతం దొయ్యి దశలో ఉన్నాయి. రైతులు ఇప్పటికే తోటలకు ఎరువులను వేసి నీటితడి అందించారు. భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క వరి పండించే రైతులు అప్రమత్తం అవుతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన రబీ ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. అధికారులు ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి వెంట వెంటనే మిల్లులకు తరలిస్తున్నారు. బయట వ్యక్తులు కూడా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ 50 నుంచి 60 శాతం వరి కోతలు పూర్తికాగా మరో 45 శాతం పంట కోయవలసి ఉందని అధికారులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున వరి కోతలు నిలుపుదల చేసినట్టు రైతులు తెలిపారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి



క్రీడా పరికరాలు అందిస్తున్న ఎంపీపీ యల్లారేశ్వరి

చాగల్లు: ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పెద్ద ఎత్తున్న యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. మండలంలోని బ్రాహ్మణగూడెంలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన మంత్రి ఆ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆమె మాట్లాడుతూ మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వుండవల్లి శ్రీనివాస్, సర్పంచ్ గురువెల్లి కుమారి, కార్పొరేషన్ డైరెక్టర్ పి.సింహాద్రి, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, ఎంపీటీసీ ఉసురుమర్తి జ్యోతి, ఎల్లె వెంకట్రావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలు దోహద పడతాయని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులకు శనివారం ఆమె ప్రభుత్వం సమకూర్చిన క్రీడా పరికరాలు అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ ఆటల సామగ్రిని సచివాలయలకు పంపిణీ చేశామన్నారు. ఎంపీడీవో జీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మట్టిలో మాణిక్యాల వంటి చురుకైన గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా త్వరలో నిర్వహించే కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రిని మండలంలోని వివిధ సచివాలయాల కార్యదర్శులకు ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఖండవల్లి, కాకరపర్రు, కానూరు ఉన్నత పాఠశాలల మైదానాలను ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు అనువుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రమేష్, ఎంఈఓ స్వరూప్, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- వేములూరులో గడప గడపకూ..



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రమాణికంగా తీసుకుని సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత దేశ చరిత్రలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలోని వేములూరు గ్రామంలో శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ గత నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వీలుగా అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, శ్రీరామా సొసైటీ మాజీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎలికె చిన వీర్రాజు, ఎంపీటీసీ సభ్యురాలు రెల్లా సరస్వతి, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు వారా రత్నరాజీవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ కొవ్వూరు, చాగల్లు మండల శాఖల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ కొవ్వూరు పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, తోట నారాయణ, ఇంటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటుతో బలహీన వర్గాలకు గుర్తింపు



మంత్రి తానేటి వనితకు జ్ఞాపిక అందిస్తున్న సంకిన భవానీప్రియ

కొవ్వూరు: బలహీన వర్గాల్లోని అనేక కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారికి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన దేవ తెలికుల కార్తిక వన సమారాధనలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవతెలికులకు అండదండగా ఉంటానని హామీ ఇచ్చారు. తమ సంఘ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని సంఘ పెద్దలు కోరారు. ఏపీ గాండ్ల తెలికుల, దేవ తెలికుల అభివృద్ధి కార్పరేషన్ చైర్ పర్సన్ సంకిన భవానీ ప్రియ, సంఘ నాయకులు మంత్రి వనితను సత్కరించారు.

రేషన్ కార్డులపై కందిపప్పు సరఫరా

దేవరపల్లి: రేషన్‌కార్డు దారులకు డిసెంబర్ నెలలో కందిపప్పు, పంచదార, గోధుమపిండి పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. కార్డుకు కిలో కందిపప్పు రూ.67, అర కిలో పంచదార రూ.17, కిలో గోధుమపిండి రూ.16 రేటుకు ఎండీయూ వాహనాల వద్ద పంపిణీ చేస్తారని ఆయన వివరించారు. కందిపప్పు 50 శాతం కార్డులకు ప్రభుత్వం సరఫరా చేసినట్టు చెప్పారు.

బైపాస్ రోడ్డుపై ఢీకొన్న కార్లు

నల్లజర్ల: బైపాస్ రహదారిపై అచ్చన్నపాలెం వద్ద శనివారం సాయంత్రం వేగంగా వెళుతున్న రెండు కార్లు ఒక దాని వెనుక మరొకటి ఢీ కొన్నాయి. రెండూ అత్యాధునిక కార్లు కావడంతో రెండు కార్లకూ బెలూన్లు ఓపెన్ అయ్యాయి. దాంతో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. నిస్సాన్ మ్యాగ్నెట్ కారు విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా మరో కారైన టాటా సఫారీ చాగల్లు మండలం మల్లవరానికి చెందినది. ప్రమాదంలో రెండు కార్లూ ధ్వంసమయ్యాయి.



ప్రమాదానికి గురైన నిస్సాన్ మ్యాగ్నెట్ కారు

ఘనంగా నంగాలమ్మ ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠ



నంగాలమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట గ్రామదేవత నంగాలమ్మ వారి ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని కన్నబాబు ఆవిష్కరించారు. దేవదాయ,ధర్మాదాయ శాఖ మంజూరు చేసిన రూ.60 లక్షలతో పాటు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఆలయ చైర్మన్ కురసాల నెహ్రూ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ జడ్డు శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల సత్యనారాయణ, కాపకాయల సూర్యనారాయణ, నాగిరెడ్డి సత్తిపండు, ఆలయ ఈఓ సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ ఆలయానికి శంకుస్థాపన

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలో అభ్యుదయ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గంగాలమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం చర్యలు చేపట్టారు.ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, శరత్‌బాబు దంపతులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ దంపతులను, సర్పంచ్ బొక్క శ్రీనివాసులకు రజక జన సేవా సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

గోదావరి ఒడ్డునే విగ్రహాల ఆవిష్కరణ



వేగేశ్వరపురంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో గోదావరి ఒడ్డునే ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి, వినాయకుని విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సంకాబత్తుల వంశస్తులు విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. వేద పండితుడు వాసు ఆధ్వర్యంలో ఉదయం నుంచీ హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఏటా కార్తిక మాసంలో ఇక్కడి ఆలయంలో గ్రామస్తులు పూజలతో పాటు కార్తిక అన్న సమారాధన కూడా నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు శీర్ల బ్రహ్మానందం, మారిశెట్టి వెంకన్నబాబు, తైలం ప్రసాద్, నున్న కృష్ణ, పంకాబత్తుల సూరిబాబు, సంకాబత్తుల కృష్ణ, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు అడ్డా శ్రీరామ్‌మోహన్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన స్ఫటిక లింగ దర్శనం



అన్నవరప్పాడులో స్ఫటిక లింగం

10 వేల మంది భక్తులకు అన్న సమారాధన



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పెరవలి: అన్నవరప్పాడు గ్రామంలోని ఉమావిశ్వేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజుల పాటు ఏర్పాటు చేసిన స్ఫటిక లింగ దర్శనం శనివారంతో వైభవంగా ముగిసింది. చివరి రోజు స్ఫటిక లింగ దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. లింగ దర్శనం కోసం సుమారు కిలోమీటరు పొడవునా జాతీయ రహదారి వెంబడి భక్తులు క్యూలో వేచి ఉన్నారు. వేలాదిగా భక్తులు రావడంతో ×హరహర మహాదేవా శంభో శంకర । అనే శరణు ఘోషతో ఈ ప్రాంతం మార్మోగింది. లింగ దర్శనానికి వచ్చిన సుమారు 10 వేల మంది భక్తులకు దాతల సహకారంతో ఆలయ నిర్వాహకులు భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంతం బాలసుందరి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, ఓసూరి బాల నాగేశ్వరరావు, కోటిపల్లి గంగన్న, యాళ్ళబండి శ్రీనివాస్, యాతం మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.